# 'పుస్తకం'

మొన్న ఆ మధ్య నేను కొత్తగా ప్రచురించిన మూడు పుస్తకాల్ని ప్రముఖ పాత్రికేయులూ, కవీ అయిన శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారికి పంపించాను. వారు నా అక్షరాలకు బదులుగా వారి అక్షరాల్ని బహూకరించారు.

అది కవితా సంకలనం... 'అనుభూతి గీతాలు'...

దాన్ని చదువుతూండగా... మధ్యలో ఓ పద్యం కాలరు పట్టుకు నన్ను నిలబెట్టింది... ఆ పద్యం ఇది.

"గాజు బీరువా తలుపు రెక్కలు తప్పించి చూస్తే
నాలుగో పరిమాణానికి నాందీ ప్రస్తావనలు...
నిలువెత్తున పలకరించే పుస్తకాలు
కొన్ని పాతబడిన లోగిళ్లు
కొన్ని నాగరక పారదర్శక స్వప్న సౌధాలు
కొన్ని నీరవ హేమంత సాయంతనాలు
కొన్ని అరణ్యక సూర్యోదయాలు
కొన్ని విషాద నిషేధాల వెన్నెల వాకిళ్లు
పుస్తకాలెప్పుడూ మేలుకొనే వుంటాయి
అక్షరాలెప్పుడూ కళ్లు తెరుచుకునుంటాయి
పలకరించి పలికిస్తే
అవి అన్వేషకుణ్ణి వెలిగించే ఇంధనాలు..."

పై పద్యం చదివిన మరుక్షణం నేను అప్రయత్నంగా నా పుస్తకాల గాజు బీరువావేపు తలెత్తి చూసా...

వంటరితనంలో... విషాదంలో, సమస్యల సుడిగుండాల్లో చిక్కుపడ్డప్పుడూ... ఆత్మీయంగా ఆప్యాయంగా పలకరించే పుస్తకాలు...

ఎంత స్నేహాన్నిస్తాయవి!

ఎంతటి వూరట కలిగిస్తాయవి!

ఎంత సాంత్వన

విసుగ్గా విసిరేసినా వినయంగా ఒదిగిపడి వుంటాయే!

ఆప్యాయంగా ఆ గాజు తలుపులు బీరువాను తడిమాను.

పై అరలో నల్లటి బౌండు పుస్తకం నన్ను అల్లరిగా పలకరించింది. 'నేనూ' అన్నట్టు... దాన్ని చూసినప్పుడల్లా ఓ అపరాధ భావన చురుక్కుమంటుంది.

ఆ పుస్తకం భాషాశాస్త్రం (philology)

ఆ పుస్తకం నాలో అపరాధ భావన కలిగించడానికి కారణం, ఆ పుస్తకం నాచేత దొండిలించబడ్డది కావడమే...

ఎందుకోగానీ పుస్తక చౌర్యానికి మరీ అంత నైచ్యం అంటగట్టబడలేదు. అయినా దొంగతనం దొంగతనం కాకుండా పోతుందా?

ఆ పుస్తకాన్ని దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం నాగ్‌పూర్ యూనివర్సిటీ లైబ్రరీనించీ దొంగిలించా. దానికి బలమైన కారణాలు కూడా నాకు నేనే చెప్పుకున్నా. అది ఎక్కడా లభ్యంకాదూ... ఒకవేళ లభ్యమైనా అప్పటి నా జేబుకి అది చాలా బరువైంది. అట్లా రకరకాలుగా నాకు నేను నా దొంగతనాన్ని సమర్థించుకున్నాను. అట్లాగని వేరే లైబ్రరీ పుస్తకాలు నా దగ్గర లేవనను... వున్నాయి. బ్రిటిష్ లైబ్రరీనించీ తెచ్చిన పుస్తకాలున్నై. ... (మా శాస్త్రుర్ల అకౌంట్‌లో) అయితే అవి పోయాయని చెప్పి మా శాస్త్రుర్లతోటి లైబ్రరీకి పెనాల్టీ కట్టించాను... అట్లా కొద్దిగానైనా రుసుం చెల్లించడం ద్వారా కొనుక్కోడమే అనే మిథ్యాతృప్తి. కానీ ఆ philology పుస్తకం మాత్రం శుద్ధంగా దొంగిలించిందే. ఒక్కోసారి దాన్ని టపాలో పంపేద్దాం అనిపిస్తుంది. ఒకవేళ పంపితే అక్కడ లైబ్రేరియను ఏమనుకుంటాడూ "ఎవడండీ యీ పిచ్చి ముండాకొడుకూ?" అని అనుకుంటాడేమో అని మిన్నకుండడం.

ఇప్పుడిలా బహిరంగంగా దీని గురించి రాస్తూంటే ఆ అపరాధ భావన పలచబడ్తూన్న భావన. ఇంగ్లీషులో పుస్తకాల పిచ్చిని 'బిబ్లియోమేనియా' అంటారు. ఏదిఏమైనా, ఎట్లావున్నా పుస్తకాలు లేని ఇల్లు నాకు అసంపూర్ణంగానే కనిపిస్తుంది.

అది దొంగిలించిందైనా, ఖరీదు చేసిందైనా, బహుమతిగా పొందిందైనా పుస్తకం ఇచ్చే స్నేహం మహోత్కృష్టమైంది. శ్రీకాంతశర్మగారి కవిత చివరి వాక్యాలు మననం చేసుకుందాం మరోసారి.

"పుస్తకాలెప్పుడూ మేలుకునే వుంటాయి
అక్షరాలెప్పుడూ కళ్లు తెరుచుకుంటాయి
పలకరించి పలికిస్తే
అవి అన్వేషకుణ్ణి వెలిగించే ఇంధనాలు" ●